సాక్షి జనగామ

ఆదివారం । 26 । మే । 2024



సదస్సుల వేదిక.. నిట్

నిట్ వరంగల్ క్యాంపస్.. జాతీయ, అంతర్జాతీయ సమావేశాలు, సదస్సులకు వేదిక అవుతోంది. ప్రపంచ స్థాయిలో తన ప్రత్యేకత చాటుకుంటుంది. - 8లో▸



'మేడిగడ్డ' బొరియతో బుగులు

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ బ్యారేజీలో బొరియ పడడంతో నిర్మాణ సంస్థతో పాటు ఇరిగేషన్‌శాఖ అధికారులు బుగులు చెందుతున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
42^0 /32^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రి సమయంలో ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వైభవంగా వార కల్యాణం



దిల్వాపూర్: శ్రీబుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి వార కల్యాణం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈఓ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

47 మంది గైర్హాజరు



జనగామ రూరల్: ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు రెండో రోజు 47 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని ఇంటర్ విద్యాధికారి ఆంజనేయరాజు తెలిపారు. శనివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఎస్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్‌లకు పరీక్షల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పలు సూచనలు చేశారు. ఉదయం జరిగిన పరీక్షలో జనరల్ విద్యార్థులు 278 కు గాను 253 మంది హాజరు కాగా 25 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 116 మందిగాను 102 హాజరు కాగా 14 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు గాను జనరల్ విభాగంలో 105 మంది విద్యార్థులకు గాను 97 మంది పరీక్షలకు హాజరు కాగా 8 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 33 మందికి 37 హాజరయ్యారు.

ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలి



జనగామ రూరల్: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షురాలు డి. సుమ అధ్యక్షతన ఫీజు నియంత్రణ చట్టం -అవశ్యకత అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం మంత్రుల సబ్ కమిటీ వేసి ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 19(1) ప్రకారం ఉచిత విద్యా అందించాలన్నారు. ప్రతీ ప్రైవేట్ విద్యా సంస్థలో 25 శాతం ఉచిత విద్య అందించాలని డిమాండ్ చేశారు. నింబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, యూసఫ్, అజయ్, విప్లవ్, శ్రీకాంత్, శ్రవన్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన కొనుగోలులో జాగ్రత్తలు పాటించండి



లింగాలఘణపురం: విత్తనాల కొనుగోలులో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని డీఏఓ వినోద్‌కుమార్ కోరారు. శనివారం మండలంలోని నేలపోగులలో రైతులకు విత్తనాల కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ ముఖ్యంగా పత్తి విత్తనాల కొనుగోలులో ప్యాకెట్లు లేకుండా లూజు విత్తనాలు కొనవద్దని, లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని, బిల్లుల్లో తయారీ తే దీ, ఎక్స్‌పైరీ తేదీలను చూడాలని, బిల్లు రశీదులను పంట చేతికొచ్చే వరకు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. జీఈఏసీ (జెనిటిక్ లైసెన్స్ నంబర్) ఉండే విధంగా చూసుకోవాలని, ఎవరైన నకిలీ విత్తనాలు విక్రయించినట్లు అనుమానం వస్తే ఏఈ, ఏఈఓలకు సమాచారం అందజేయాలని సూచించారు. డీఏఓతో పాటు ఏఓ వెంకటేశ్వర్లు, ఆయా గ్రామాల్లో ఏఈఓలు శ్రీనివాసు, స్పందన, అపూర్వ, సౌజన్యతో పాటు రైతులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రచారం

చివరి రోజు జోరుగా సాగిన ప్రచారం

- పట్టభద్రుల ఓట్ల కోసం పడరాని పాట్లు
- పొద్దంగా ఫోన్ కాల్స్... సాయంత్రం మాటా ముచ్చట
- పోలింగ్‌కు మిగిలింది ఒక్కరోజే...
- గెలుపే లక్ష్యంగా బరిలో మూడు పార్టీలు
- 48 గంటల పాటు మద్యం దుకాణాలు బంద్
- పల్లెల్లో విచ్చల విడిగా బెల్ట్‌షాపులు

జనగామ: వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్‌కు ఒక్కరోజు మాత్రమే మిగిలి ఉండటంతో అన్ని పార్టీలు గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నాయి. శనివారం సాయంత్రం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగిసి పోగా... అంతా గప్ చుప్‌గా కానిచ్చేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మూడు పార్టీలో పోటా పోటీగా ప్రచారం చేపట్టగా.. పోలింగ్‌కు మిగిలిన ఒక్క రోజు కీలకంగా మారనుంది. ఏ ఒక్క ఓటు సైతం చేజారి పోకుండా ఎత్తుకు పై ఎత్తు వేస్తున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, బీజేపీ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొజ్జపల్లి సుభాష్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాటి బీరప్ప తదితరుల నేతృత్వంలో ఆయా పార్టీల ఎమ్మెల్సీ అభ్యర్థులు తీన్మార్ మల్లన్న, ఏనుగుల రాకేష్‌రెడ్డి, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి విజయం కోరుతూ అహర్నిషలు కృషి చేశారు.

పొద్దంగా ఫోన్ కాల్స్.. సాయంత్రం మాటా ముచ్చట

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగియడంతో నేరుగా పట్టభద్రులను సంప్రదించే పనిలో పార్టీలు నిమగ్నమయ్యాయి. ఓ వైపు ఇంటింటా ప్రచారం... మరో వైపు ఫోన్ కాల్స్‌తో ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రచారానికి ఎండ్ కార్డు పడడం, పోలింగ్‌కు ఒక్క రోజు మాత్రమే మిగిలి ఉండటంతో మాట ముచ్చటతో ఓటు కోసం కోటి తిప్పలు పడుతున్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వేసి.. రెండో ప్రాధాన్యత వద్దంటూ ఎవరికి వారే చెప్పుకుంటున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో బూత్ ఖర్చులు...? ఇవ్వగా... ఎమ్మెల్సీ ఎలక్షన్‌లో ఆ ఆనవాయితీ లేకపోవడంతో కేడర్ ఒకింత అలక పాన్పు వేసినట్లు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైన భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కేడర్‌ను కాపాడుకుంటున్నారు. ఆదివారం రోజు విందులతో ఖుషీ చేసేందుకు ఒకటి, రెండు రాజకీయ పార్టీలు ప్రణాళిక చేసినట్టు సమాచారం. మూడు ప్రధాన పార్టీల కదలికలపై ఎలక్షన్ కమిషన్ నిఘా ఉంచింది. ఎన్నికల సంఘం కంట పడకుండా.. ఈ మూడు పార్టీలు అంతా గప్‌చుప్‌గా కానిచ్చేస్తున్నాయి.

మద్యం దుకాణాలు బంద్..



ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 27వ తేదీ సాయత్రం 4 గంటలకు.. మొత్తంగా 48 గంటల పాటు జిల్లాలో మద్యం దుకాణాలు మూసి వేయాలని అధికా రులు వెల్లడించారు. ఎక్సైజ్ శాఖ అధికారుల పర్యవేక్షణలో వైన్స్‌లను సీజ్ చేశారు. పోలింగ్ ముగిసే వరకు వైన్స్‌లపై నిఘా ఉంచగా.. పల్లెల్లో విచ్చల విడిగా బెల్ట్ దుకాణాలు తెరుచుకున్నాయి. మద్యం దుకాణాల మూసి వేతతో ఒక్కరోజు ముందుగానే బెల్ట్ దుకాణాదారులు పెద్ద ఎత్తున మద్యం కొనుగోలు చేసి తీసుకు వెళ్లారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే బెల్ట్ నిర్వాహకులు ఆడింది ఆట, పాడింది పాటగా మారుతుందనే ఆరోపణలు లేకపోలేదు. జనగామ పట్టణంతో పాటు లింగాలఘణపురం, బచ్చన్నపేట, నర్మెట, రఘునాథపల్లి, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి తదితర మండల కేంద్రాల్లో ప్రధాన వీధుల్లో బెల్ట్ దుకాణాల నిర్వహణ సమీప కుటుంబాలకు ఇబ్బంది కలుగుతున్నా.. ఎవరికీ పట్టింపులు లేవనే ఆరోపణలు లేకపోలేదు.

ఎమ్మెల్సీ ఓటు వేయండిలా..

- '1' ప్రాధాన్యత అంకె ఇవ్వకుండా మిగతావి ఇస్తే ఆ ఓటు చెల్లదు

- 8లో▸

12 గుర్తింపు కార్డులతో ఓటు వేయొచ్చు

కాళోజీ సెంటర్ : ఎమ్మెల్సీ ఉపఎన్నికకు పట్టభద్రులు 12 రకాల గుర్తింపు కార్డులతో ఓటు హక్కు వినియోగించుకోవచ్చని వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. ఓటరు గుర్తింపు కార్డులేని వారు ఆధార్‌కార్డు, ఉపాధిహామీ జాబ్‌కార్డు, బ్యాంకు, పోస్టాఫీస్ పాస్‌పుస్తకాలు, కార్మిక మంత్రిత్వశాఖ జారీ చేసిన ఆరోగ్యబీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, పెన్షన్ డాక్యుమెంట్, ప్రభుత్వ ఉద్యోగులకు జారీ చేసిన గుర్తింపు కార్డులు, ప్రత్యేక వైకల్యం తదితర గుర్తింపుకార్డుల్లో ఏదో ఒకదానితో ఓటు వేయవచ్చని తెలిపారు.

27న ప్రత్యేక క్యాజువల్ లీవ్

పట్టుభద్రుల ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఈనెల 27న ప్రత్యేక క్యాజువల్ లీవ్‌ను ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య ప్రకటించారు. ఓటుహక్కు ఉన్న ప్రైవేట్ సంస్థలు, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో పనిచేసే పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆయా యాజమాన్యాలు వెసులుబాటు కల్పించాలని పేర్కొన్నారు. ఈనెల 26, 27న పెయిడ్ హాలిడేగా పరిగణించాలని తెలిపారు.

ఉన్నత చదువులకు 'దోస్త్'



ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల



ఇంటింటి ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

- ప్రారంభమైన డిగ్రీ ప్రవేశాలు
- పూర్తయిన మొదటి విడత నమోదు
- ప్రభుత్వ కళాశాలల్లో ప్రత్యేక వసతులు

జనగామ రూరల్: పేద విద్యార్థులు ఉన్నత చదువులకు వెల్లడానికి తెలంగాణ ఉన్నత విద్యా మండలి 'దోస్త్' ద్వారా డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. మొదటి దశ ప్రవేశాల నమోదు ఈ నెల 25తో ముగియగా రెండు, మూడో దశ ప్రవేశాల నమోదుకు జూన్ 25 వరకు అవకాశం ఉంది. ఇటీవల ఇంటర్ ఫలితాలు విడుదల కావడంతో విద్యార్థులు డిగ్రీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. జిలాల్లో 10 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఉండగా.. పేరొందిన ఏకైక ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జిల్లా కేంద్రంలో ఉంది. ఇందులో అన్ని రకాల వసతులు, ఉత్తమ అధ్యాపకులచే బోధన అందిస్తున్నారు. గతంలో 541 పైగా అడ్మిషన్లు వచ్చాయి. గత సంవత్సరం 93 శాతం ఉత్తీర్ణత సాధించారు. కళాశాల గ్రంథాలయంలో 26వేల పుస్తకాలు ఉన్నాయి. గత ఏడాది కళాశాలకు చెందిన విద్యార్థులు పొలిటికల్ సైన్స్‌లో ఉత్తమ ర్యాంకు సాధించి 25 వేల నగదు ప్రోత్సాహకం అందుకున్నారు. ప్లేస్‌మెంట్ ద్వారా కళాశాలకు చెందిన 88 మంది వివిధ శాఖల్లో ఉద్యోగాలు పొందారు. వీరిలో ఐదుగురు భారత నేవీలో ఉద్యోగం సాధించారు. అలాగే ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌లో శిక్షణ ఇస్తున్నాం.

ప్రభుత్వ డిగ్రీలో ప్రత్యేక పథకాలు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశం పొంది మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కమిషనర్ ద్వారా నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు. ప్రతీ గ్రూప్‌లో యూనివర్సిటీ టాపర్‌కు ఉచిత ల్యాప్‌టాప్, అలాగే ప్రతీ సబ్జెక్టులో జిల్లా టాపర్‌కు రూ.3,000 నగదు బహుమతి ఇస్తారు. జాతీయ స్థాయిలో విశ్వవిద్యాలయాల్లో పీజీ సీటు పొందిన వారికి రూ.50,000 నగదు ప్రోత్సాహకం అందజేస్తారు.

'దోస్త్' ప్రవేశాల వివరాలు

మొదటి దశ : ప్రవేశాల నమోదు ఈనెల 25 వరకు అవకాశం. వెబ్ ఆప్షన్లు కొనసాగుతున్నాయి. సర్టిఫికెట్ల పరిశీలన మే 24, 25. సీట్ల కేటాయింపు జూన్ 3న.

రెండో దశ : ప్రవేశాల నమోదు జూన్ 4 నుంచి 13 వరకు. వెబ్ ఆప్షన్లు జూన్ 4 నుంచి 14 వరకు. సర్టిఫికెట్ల పరిశీలన 13 వరకు. సీట్ల కేటాయింపు జూన్ 14న.

మూడో దశ : ప్రవేశాల నమోదు జూన్ 19 నుంచి 25 వరకు. వెబ్ ఆప్షన్లు ఆగస్టు 19 నుంచి 25 వరకు. సర్టిఫికెట్ల పరిశీలన 26న. సీట్ల కేటాయింపు 29న. కళాశాలల్లో అన్ని దశల సీట్ల కేటాయింపు తర్వాత స్లైడింగ్ ముగిశాక ఫైనల్ రిపోర్ట్‌తో తరగతులు ప్రారంభమవుతాయి.

ప్రభుత్వ కళాశాలలో చేరాలి..



మా కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన ఉంటుంది. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, అథ్లెటిక్స్ వంటి క్రీడలు ఉన్నాయి. గ్రంథాలయం, ల్యాబ్‌లు, డిజిటల్ బోధన అందుబాటులో ఉంది. అన్నిరంగాల్లో విద్యార్థుల సమాగ్రాభివృద్ధికి కృషి చేస్తాం. విద్యార్థులు ప్రవేశాలు పొంది అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

- నర్సయ్య, ఏబీవీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఉప ఎన్నిక

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ: ఈ నెల 27న నిర్వహించనున్న వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నిక పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. శనివారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశం మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ తో కలిసి పోలింగ్ నిర్వహణపై నోడల్ అధికారులు, పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు, రూట్ అధికారులు, సెక్టార్ అధికారులకు రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టభద్రుల ఉప ఎన్నికలో 52 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలిపారు. జనగామ, ఘన్‌పూర్ (స్టేషన్) డివిజన్‌ల వ్యాప్తంగా (23,419) మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని, ఇందుకోసం 27 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు సమన్వయంతో పనిచేయాలన్నారు. బ్యాలెట్ జారీ, తదుపరి కౌంటర్ ఫైల్ పై ఓటరు సంతకం తీసుకోవాలన్నారు. పురుష, మహిళా ఓటర్ల సంఖ్యను నమోదు చేయాలని, బ్యాలెట్ పేపరును ఓటరుకు ఇచ్చేటప్పుడు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఈ నెల 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుందని, పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో పోలింగ్ బాక్స్‌లను ఓపెన్ చేసి చూపాలన్నారు. ఓటరుకు ఎడమ చేతి మధ్య వేలుకు ఇండిబుల్ ఇంకు పెట్టాలన్నారు.

నేడు మెటీరియల్ పంపిణీ

నేడు కలెక్టర్ కార్యాలయంలో పోలింగ్ మెటీరియల్ పంపిణీ (డిస్ట్రిబ్యూషన్) జరుగుతుందని, అదే రోజు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులకు పోలింగ్ కేంద్రాల్లో వీల్ చైర్లు, తాగునీరు, తదితర మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. అంతకుముందు పోలింగ్ నిర్వహణ, బ్యాలెట్ బాక్సుల సీలింగ్ విధానంపై ఎన్నికల అధికారులందరికీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు కొమురయ్య, వెంకన్న, నోడల్ అధికారులు, సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు, పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

'ముడుపుల చెల్లింపులు అవాస్తవం'

కాజీపేట అర్బన్: జిల్లా గిరిజన అభివృద్ధి అధికారికి వసతి గృహ సంక్షేమాధికారులు, హెడ్ మాస్టర్లు ముడుపులు చెల్లించినట్లు వస్తున్న ఆరోపణలు అవాస్తమని వసతి గృహ సంక్షేమాధికారులు, హెడ్ మాస్టర్లు తెలిపారు. హనుమకొండ జిల్లాలోని గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శనివారం వసతి గృహ సంక్షేమాధికారులు, హెడ్ మాస్టర్లు మాట్లాడారు. అదనపు బాధ్యతలు నిర్వహించడం భారమైనా నిర్వహిస్తున్నామని, ఇందుకు ముడుపులు చెల్లించడం అవాస్తమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారులు, హెడ్‌మాస్టర్లు జ్యోతి, కృష్ణ, తిరుమల, విజయలక్ష్మి, రజని, రమాదేవి, రాజారావు, శంకర్‌కుమార్ పాల్గొన్నారు.

బెట్టింగ్‌ల జోరు



ఉత్కంఠ రేపిన క్వాలిఫయర్ మ్యాచ్

- హైదరాబాద్ కేంద్రంగా జిల్లా నుంచి దందా...!
- చివరి మూడు ఓవర్లలో రూ. వేలు, లక్షల్లో బెట్టింగ్
- ఫైనల్‌కు రంగంలోకి దిగిన ఏజెంట్లు?

జనగామ: ఐపీఎల్ రెండో క్వాలిఫయర్ మ్యాచ్‌లో బెట్టింగ్‌ల జోరు కొనసాగింది. తొలి క్వాలీఫయర్‌లో తడబడిన సన్‌రైజర్స్...ఆర్ఆర్‌తో జరిగిన పోరులో సత్తాచాటుకుంది. పరుగులు వేటలో తడబడిన ఎస్ఆర్‌హెచ్.. 175 పరుగుల లక్ష్యాన్ని రాజస్తాన్ టీం ముందు ఉంచింది. పరుగులు ఎక్కువగా అనిపించినా... ప్రస్తుత సీజన్‌లో 200 పైచిలుకు స్కోర్ చాలా చిన్నదిగా మారిపోయింది. దీంతో సన్ రైజర్స్ ఫైనల్‌కు అర్హత సాధిస్తుందా లేదా అనే టెన్షన్.. అభిమానులను కలవర పాటుకు గురి చేసింది. అభిమానుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకున్న బెట్టింగ్ ముఠాలు రంగంలోకి దిగి భారీగా డబ్బుల వసూళ్లకు తెరలేపినట్లు ప్రచారం జరిగింది. మ్యాచ్ ప్రారంభానికి ముందుగానే.. బెట్టింగ్ రాయుళ్లతో సంప్రదింపులు జరిపినట్లు ప్రచారం జరిగింది. స్థానికంగా ఉన్న ఏజెంట్ల సహకారంతో ఐపీఎల్‌లో బెట్టింగ్ దందా కొనసాగినట్లు సమాచారం. ఓవర్లు, సిక్స్, వికెట్.. పవర్ ప్లేలో చేసే స్కోర్ ఎంత ఇలా ఒక్కో కేటగిరి వారీగా రూ.1000 నుంచి రూ.లక్ష వరకు బెట్టింగ్‌కు పాల్పడినట్లు చర్చకు దారి తీసింది. ఆన్‌లైన్ రమ్మీ, మట్కాకు అలవాటు పడిన వారితో పాటు యువకులు, ఆయా వర్గాలకు చెందిన కొత్తవారు సైతం అత్యాశకు పోయి ఐపీఎల్ బెట్టింగ్‌లో లక్షలకు లక్షలు పోగొట్టుకుని చేతులు కాల్చుకుంటున్నారనే ప్రచారం లేకపోలేదు.

వాట్సాప్ కాల్ చేస్తూ..

హైదరాబాద్ కేంద్రంగా జనగామలోని పలువురు ఏజెంట్ల సహకారంతో యువతను టార్గెట్ చేస్తున్నారు. ఇంటర్, డిగ్రీ, బీటెక్, తదితర విద్యాభ్యాసం చేస్తున్న యువతకు వాట్సాప్ కాల్ చేస్తూ.. బెట్టింగ్ రొంపిలోకి లాగుతున్నారని తెలుస్తోంది. ఒకటికి రెండు... రూ. 100కు రూ.100 అంటూ సినిమా ట్రయల్ చూపిస్తూ.. జలగల్లా పట్టి పీడిస్తున్నారు. ఇందులో చాలా మంది విధి లేని పరిస్థితిల్లో బెట్టింగ్ జూదం అలవాటు చేసుకుని.. దానికి బానిసలుగా మారిపోతున్నారు. జిల్లా కేంద్రంలోనే లక్షల్లో బెట్టింగ్ జరుగుతుందన్న ప్రచారం ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

బాల్ బాల్‌కు పెరిగిన బెట్టింగ్

చెన్నై చపాక్ స్టేడియంలో ఈ నెల 24న రాజస్తాన్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరిగిన రెండవ క్వాలీఫయర్ మ్యాచ్ ఉత్కంఠ భరితంగా జరిగింది. ఇక్కడే బెట్టింగ్ ముఠాలకు కాసులు కురిపించగా... అత్యాశకు పోయిన అమాయకులు జేబులు ఖాళీ చేసుకున్నారు. మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ 9 వికెట్లు కోల్పోయి 175 పరుగులు చేయగా... రాజస్తాన్ విజయం ఖాయమని అంతా భావించారు. మెజార్టీ వర్గాలు రాజస్తాన్ విజయం సాధిస్తుందని లక్షల రూపాయలు బెట్టింగ్‌కు పాల్పడగా...79 పరుగులకు చేరుకునే సరికి ఆర్ఆర్ 5 వికెట్లు కోల్పోవడంతో బెట్టింగ్ జూదం కాస్త సన్‌రైజర్స్ వైపు తిరిగింది. మొదటగా రాజస్తాన్ వైపు బెట్టింగ్‌కు దిగిన వారితో పాటు మరికొందరు ఎస్ఆర్‌హెచ్ వైపు మొగ్గు చూపారు. మ్యాచ్ 15వ ఓవర్ నుంచి ఓవర్, మూడు బాల్స్, వికెట్, సిక్స్ ఇలా కేటగిరీ వారీగా వన్‌టైంలోనే రూ.లక్షకు బెట్టింగ్‌కు దిగిన వారు ఉన్నారని పట్టణంలో ప్రచారం జరుగుతుంది. చివరి 8 బాల్స్‌లో ప్రతీ బాల్‌కు బెట్టింగ్ జరిగినట్లు మాట్లాడుకుంటున్నారు. ఉత్కంఠ పోరులో ఎస్ఆర్‌హెచ్ విజయం సాధించి.. ఫైనల్ పోరుకు అర్హత సాధించగా... ఇందులో గెలుపోటములపై అప్పుడే బెట్టింగ్‌లు మొదలయ్యాయి.

బయటకు చెప్పు కోలేక..

ఐపీఎల్ క్రికెట్ పుణ్యమాని వందలాది కుటుంబాలు మానసిక వేదనకు గురవు తున్నారు. ఇంట్లోని కొంతమంది కుటుంబ సభ్యులు బెట్టింగ్‌కు బానిసలుగా మారిపోతూ... లక్షలు పోగొట్టుకుంటున్నారు. గతంలో బెట్టింగ్‌లో ఆ త్మహత్యాయత్నాలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. దీంతో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలు చేస్తున్న తప్పిదాలతో బయటకు చెప్పుకోలేక మదన పడిపోతున్నారు. అప్పులిచ్చిన వారు ఇంటిపైకి వచ్చి గొడవలకు దిగు తుండడంతో తల తాకట్టు పెట్టి కొడుకుల రుణం తీర్చుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు పాకిన బెట్టింగ్ మహమ్మారి.. పరిస్థితి ఇలాగే ఉంటే... కుటుంబ సభ్యులకు తెలియకుండానే ఇళ్లు, వ్యవసాయ భూములు సైతం తాకట్టుపెట్టే ప్రమాదం లేకపోలేదని మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పోలీసు శాఖ దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుద్యోగ సమస్యలపై పోరాటం చేస్తా..

- బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి



ప్రచారం నిర్వహిస్తున్న గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

జనగామ: విద్యార్థి దశ నుంచి ఎన్నో ఉద్యమాలు చేసి విద్యార్థుల సమస్యలపై పోరాటం చేశానని, ఒక్కసారి అవకాశం కల్పిస్తే నిరుద్యోగ సమస్యలపై పోరాటం చేస్తానని బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో లైబ్రరీ, కోర్టు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ 40 సంవత్సరాలు ఒకే రాజకీయ పార్టీలో ధర్మం కోసం నిబద్ధతతో పనిచేశానని ఒక్కసారి అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు.మోడి సహకారంతో స్వయం సమృద్ధి నిరుద్యోగులకు అండగా ఉంటానని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, రాష్ట్ర నాయకులు కేవీఎల్ఎన్ రెడ్డి,ఉడుగుల రమేష్, సౌడ రమేష్, శివరాజ్ యాదవ్, మహంకాళి హరిచంద్రగుప్త, పెద్ది శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతను మోసం చేసిన బీజేపీ, బీఆర్ఎస్

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగించిన బీఆర్ఎస్ దొందూదొందేనని, హామీలను విస్మరించి యువతను, నిరుద్యోగులను దగా చేశాయని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపుతోనే నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు చింతకుంట్ల నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, బూర్ల శంకర్, ఇనుగాల వెంకటేశ్వర్‌రెడ్డి, తోట సత్యం, దుంపల పద్మారెడ్డి, గట్టు రమేష్, సింగపురం వెంకటయ్య, గాండ్ల రాజు, కిషన్‌రాజ్, సంపత్, కొంతం శ్రీను, జీడి రమేష్, గుర్రం ఫాతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలకి గుణపాఠం తప్పదు



మాట్లాడుతున్న డాక్టర్ తాటికొండ రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలో దగాకోరు కాంగ్రెస్, బీజేపీలకి గుణపాఠం తప్పదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని తాటికొండ, శివునిపల్లి గ్రామాల్లో శనివారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టభద్రులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ అబద్దపు హామీలతో కాలం గడుపుతున్నాయన్నారు. పట్టభద్రులు ఆలోచించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల కుమార్, తాటికొండ సురేష్, కనకం గణేష్, అక్కినపెల్లి బాలరాజు, గాదె చిట్టిబాబు, గుర్రం యేసుబాబు, మాతంగి దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నా పదవి కాలం ముగిసినా కేయూ అభివృద్ధికి కృషి

● మాజీ వీసీ తాటికొండ రమేశ్



కేయూ క్యాంపస్: 'వ్యక్తిగత ప్రయోజనాలకంటే వ్యవస్థ ప్రయోజనాలు ముఖ్యం.. నా పదవీ కాలం ముగిసినా కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధికి ఒక పౌరుడిగా నిర్మాణాత్మక కృషి అందిస్తానని' కేయూ మాజీ వీసీ తాటికొండ రమేశ్ పేర్కొన్నారు. ఈనెల 21న వీసీగా తాటికొండ రమేశ్ పదవీకాలం ముగిసిన విషయం విదితమే. తన హయాంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలతోపాటు వివిధ అవగాహన ఒప్పందాలు, సదస్సులు, తదితర అంశాలను ప్రస్తావిస్తూ శనివారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. తాను వీసీగా బాధ్యతలు చేపట్టాక యూనివర్సిటీకి న్యాక్ ఏప్లస్‌గ్రేడ్ సాధించామన్నారు. 2022-2023లో బడ్జెట్‌లో ప్రభుత్వ నుంచి యూనివర్సిటీకి అదనంగా రూ. 31 కోట్లు రాబట్టగలిగామన్నారు. పీహెచ్‌డీ కేటగిరీ-1, కేటగిరీ- 2 ద్వారా 300మందికి పైగా విద్యార్థులకు ప్రవేశాలు కల్పించామన్నారు. కొద్దిమంది సీట్లు రాని వ్యక్తులు పీహెచ్‌డీ అడ్మిషన్లలో అక్రమాలు జరిగాయని గతేడాదిలో ధర్నాచేసి అనేక రకాలు అవమానించారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇందుకు సంబంధించి విచారణ కమిటీని నియమించిందని, ఆ కమిటీ ప్రవేశాలు పారదర్శకంగా జరిగాయని చెప్పిందని తెలిపారు. యూనివర్సిటీ భూమి గుంట కూడా అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించామన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా కారుణ్య నియామకాలు పూర్తిచేశామని తెలిపారు. దేశంలోనే ప్రతిష్ఠాత్మక ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌ను మూడు దశాబ్దాల తరువాత యూనివర్సిటీలో నిర్వహించామని వివరించారు. తన హయాంలోనే యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగంలో రాష్ట్రపతి అవార్డుతోపాటు అప్పటి గవర్నర్ నుంచి రాష్ట్రస్థాయి రెడ్‌క్రాస్ సేవా అవార్డు సాధించామని తెలిపారు. కేయూకు 34 వివిధ సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. యూనివర్సిటీ అభివృద్ధిలో తనకు సహకరించిన అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు ధాన్యవాదాలు తెలుపుతున్నాని మాజీ వీసీ రమేశ్ పేర్కొన్నారు.

సదస్సుల వేదిక.. నిట్



అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియం



బోస్ హాల్

క్యాంపస్‌లో కాన్ఫరెన్స్ హాల్ కాంప్లెక్స్, అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఏర్పాటు

- సమావేశాలకు మొగ్గుచూపుతున్న ఔత్సాహికులు
- ఇన్‌స్టిట్యూట్‌కు ఆదాయం సమకూర్చుతున్న సెంటర్లు

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్ క్యాంపస్.. జాతీయ, అంతర్జాతీయ సమావేశాలు, సదస్సులకు వేదిక అవుతోంది. నిత్యం వివిధ ఆవిష్కరణలతో ప్రపంచ స్థాయిలో తన ప్రత్యేకత చాటుకున్న నిట్ వరంగల్‌లో కాన్ఫరెన్స్ హాల్ కాంప్లెక్స్‌తో పాటు అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియం అందుబాటులోకి తీసుకొచ్చారు. ఫలితంగా ఈ క్యాంపస్‌లో సదస్సులు, సమావేశాలు నిర్వహించుకుంటే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఔత్సాహికులు, వివిధ కళాశాలలు, పాఠశాలలు, ప్రభుత్వ అధికారులు భావిస్తున్నారు. ఇక్కడే తమ సమావేశాలు నిర్వహించుకుంటున్నారు. సెక్యూరిటీతో పాటు పూర్తిగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో కూడిన ఏసీ కాన్ఫరెన్స్ హాల్స్, ఎల్‌ఈడీ ప్రొజెక్టర్, స్క్రీన్స్‌తో సెంటర్లను ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు.

ప్రత్యేకంగా కాన్ఫరెన్స్ హాల్ కాంప్లెక్స్..

నిట్ వరంగల్‌లో తమ విద్యార్థులకు సదస్సులు, సమావేశాలు నిర్వహించడంతో పాటు గెస్ట్ లెక్చర్స్ కోసం ప్రత్యేకంగా కాన్ఫరెన్స్ హాల్స్ ఏర్పాటు చేశారు. సైంటిస్ట్‌లు, స్వాతంత్ర్య ఉద్యమ సంగ్రామంలో పాల్గొన్న నాయకుల పేరిట కాన్ఫరెన్స్ హాల్ కాంప్లెక్స్‌తో పాటు రాజ్యాంగ నిర్మాత పేరిట అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు.

కాన్ఫరెన్స్ హాల్స్ ఇలా..

నిట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ కాంప్లెక్స్‌లో హోమీ బాబా హాల్, బోస్ హాల్, రామన్ హాల్, రామానుజన్ హాల్, ఖురానా హాల్, చంద్రశేఖర్ హాల్ ఉన్నాయి. ఇందులో హోమీబాబా హాల్, రామానుజన్ హాల్‌లో 125 మంది, ఖురానా హాల్ 90 మంది, బోస్ హాల్, రామన్ హాల్, చంద్రశేఖర్ హాల్‌లో 160 మంది, అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో 400 మంది, మరో ఆడిటోరియంలో వెయ్యి మంది కూర్చునే సామర్థ్యంతో సమావేశాలకు అనువుగా ఏర్పాటు చేశారు. అదే విధంగా నిట్‌లో ప్రతి డిపార్ట్‌మెంట్‌కు 80 నుంచి 120 మంది కూర్చునే సామర్థ్యంతో ప్రత్యేకంగా ఒక హాల్ ఉంటుంది.

ఆదాయ వనరుగా..

నిట్ వరంగల్‌లో ఏర్పాటు చేసిన సెమినార్ హాల్స్, అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియం ఆదాయ వనరుగా మారుతోంది. నిట్ తమ సమావేశాలతో పాటు బయట వ్యక్తులకు ప్రత్యేక రుసుముతో అవకాశం కల్పిస్తోంది. కాన్ఫరెన్స్ హాల్ కాంప్లెక్స్ లోని హాల్స్‌కు ప్రతి సమావేశానికి రూ. 8 వేలు , అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియం రూ.15వేలకు అద్దెకు ఇస్తున్నారు.

చనిపోయిన వ్యక్తికి బుల్లెట్ బండి రుణం

రుణం కిస్తీ చెల్లించాలని మృతుడి ఇంటికి చేరుకున్న కలెక్షన్ మేనేజర్

- రుణం ఎప్పుడిచ్చారని నిలదీసిన మృతుడి కుటుంబ సభ్యులు
- వరంగల్ జిల్లాలో ఘటన




నందిగామలో ఉద్యోగులను నిలదీస్తున్న స్థానికులు



తన కుమారుడి ఫొటో చూపుతున్న తండ్రి నగేష్

నల్లబెల్లి: బ్యాంక్ రుణం కావాలంటే అధికారులు పలు షరతులు విధిస్తారు. అందుకు అవసరమైన పూర్తి డాకుమెంట్స్ అందించాలని కోరుతారు. ఆపై వెరిఫికేషన్ పూర్తి చేసి సంతృప్తి చెందిన తరువాతే రుణం మంజూరు చేస్తారు. కానీ అందుకు విరుద్ధంగా మృతి చెందిన వ్యక్తికి బుల్లెట్ (రాయల్ ఎన్‌ఫీల్డ్) బండికి ఖమ్మం బ్రాంచ్‌కి చెందిన కొటాక్ మహీంద్రా బ్యాంక్ రుణం మంజూరు చేసింది. వాయిదాలు చెల్లించాలని బ్యాంక్ అధికారులు ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు అవాక్కయ్యారు. ఈ ఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని నందిగామలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబ సభ్యులు, కలెక్షన్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామ గ్రామానికి చెందిన భూక్య సునీత, నగేష్ దంపతులకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు రాకేష్ 2022, జనవరి 23న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, కోటక్ మహేంద్రా బ్యాంక్ ఖమ్మం బ్రాంచ్ అధికారులు.. 2023 అక్టోబర్ 18న భూక్య రాకేష్ పేరుమీద రాయల్ ఎన్‌ఫీల్డ్-350 ద్విచక్ర వాహనానికి సుమారు రూ.3 లక్షల రుణం మంజూరు చేశారు. ఇందుకు రూ.7,150 చొప్పున 48 నెలలపాటు కిస్తీలు చెల్లించాలని ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు మూడు వాయిదాలు చెల్లించాడు. ఆ తరువాత వాయిదాలు చెల్లించకపోవడంతో రుణం రికవరీ కోసం కలెక్షన్ మేనేజర్ శ్రీనివాస్, వెరిఫికేషన్ ఏజెంట్ అరవింద్ నందిగామకు చేరుకున్నారు. వాయిదా బకాయి డబ్బులు చెల్లించాలని కోరారు. రెండున్నరేళ్ల క్రితం మృతిచెందిన తమ కుమారుడికి రుణం ఎలా ఇచ్చారని వారిని నిలదీశారు. తీసుకున్న వ్యక్తి వివరాలు తెలియజేసేవరకు ఇక్కడి నుంచి కదలనియ్యమని చుట్టుముట్టారు. రుణం తీసుకుని ఇలా ఎందుకు బుకాయిస్తున్నారని ఉద్యోగులు ప్రశ్నించగా, చనిపోయి రెండున్నరేళ్లు అవుతుందని చెప్పితే అర్థంకావడం లేదని స్థానికులు ఉద్యోగులను మందలించారు. పోలీసుల కు సమాచారం అందించి ఉద్యోగులను అప్పగించారు. మృతిచెందిన తన కుమారుడి పేరిట రుణం మంజూరు చేసిన అధికారులు, తీసుకున్న వ్యక్తి, దళారులను గుర్తించి శిక్షించాలని పోలీసులను కోరారు. కాగా, నర్సంపేటకు చెందిన ఓ వ్యక్తి.. చనిపోయిన రాకేష్ పేరు మీద తీసుకున్నట్లు తెలుస్తోంది. కాగా, ఇందులో బ్యాంక్ సిబ్బంది, దళారుల పాత్ర ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నిక ఓటింగ్ విధానంపై ఈసీ విడుదల చేసిన నమూనా బ్రోచర్



ఎమ్మెల్సీ ఓటు వేయండిలా..

రేపు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

- బరిలో ఉన్న 52మంది అభ్యర్థులందరికీ ఓటు వేయొచ్చు
- '1'ప్రాధాన్యత అంకె ఇవ్వకుండా మిగతావి ఇస్తే ఆ ఓటు చెల్లదు
- అధికారి ఇచ్చిన పెన్నునే ఉపయోగించాలి



ఓటు వేసే విధానం..

- ప్రతి అభ్యర్థికి ఎదురుగా పార్టీ పేరు లేదా స్వతంత్ర అభ్యర్థి అని రాసి ఉంటుంది.
- పార్టీల గుర్తులు ఉండవు.
- అభ్యర్థి పేరు ఎదురుగా ఖాళీ బాక్స్ ఉంటుంది.
- పోలింగ్ అధికారి ఇచ్చిన పెన్నుతో మాత్రమే ఓటరు తన ఓటు వేయాల్సి ఉంటుంది.
- అభ్యర్థి పేరు ఎదురుగా ఖాళీ బాక్స్‌లో పెన్నుతో కేవలం నంబర్ మాత్రమే వేయాల్సి ఉంటుంది.

వరంగల్ డెస్క్: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ రేపు (సోమవారం) జరగనుంది. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 52 మంది అభ్యర్థులు ఉన్నారు. ఈ ఉప ఎన్నిక బ్యాలెట్ పేపర్ పద్ధతిన నిర్వహిస్తున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇతర సాధారణ ఎన్నికలకు ఓటు వేసే విధానంలో చాలా తేడా ఉంటుంది. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో ఓటు వేసే క్రమంలో ఈవీఎంలను వాడుతారు. ఆ ఎన్నికల్లో అభ్యర్థి పేరు, పార్టీ గుర్తు ఉంటుంది. ఒకే అభ్యర్థికి ఓటు వేయాల్సి ఉంటుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అందుకు భిన్నంగా ఉంటాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులందరికీ ప్రాధాన్యతా క్రమంలో ఓటు వేసే అవకాశం ఓటర్లకు ఉంటుంది.

ప్రాధాన్యతాక్రమంలోనే ఓటు..

- ప్రతీ ఓటరు బరిలో ఉన్న మొత్తం అభ్యర్థుల్లో ఒక్కరికి లేదా కొందరికి లేదా అందరికీ ఓటేయొచ్చు.
- అంకెలు మాత్రమే ఆ బాక్సులో ప్రాధాన్యతాక్రమంలో వేయాల్సి ఉంటుంది.
- మొదటి ప్రాధాన్యత ఓటు వేస్తేనే ఆ ఓటు చెల్లుబాటు అవుతుంది.
- ఏ వ్యక్తికైతే మొదటి ప్రాధాన్యత ఓటు వేస్తారో ఆ వ్యక్తి బ్యాలెట్ పేపర్ వరుసలో ఏ నంబర్‌లో ఉన్నా కూడా.. బాక్సులో 1 అనే అంకె వేయాల్సి ఉంటుంది.
- 1, 2, 3, 4, 5 ఇలా ప్రాధాన్యతాక్రమంలో పోటీలో ఉన్న అభ్యర్థులకు ఓటు వేయాలి.

ఒక్కరికి కూడా ఓటేయొచ్చు

- పోటీలో ఎంత మంది అభ్యర్థులు ఉన్నా అందులో 40వ సీరియల్ నంబర్‌లో ఉన్న అభ్యర్థికి ఒక్కరికే ఓటు వేయాలంటే అతడికి ఎదురుగా ఉన్న బాక్సులో 1 అని ఓటు వేసి మిగతా వారికి వేయకున్నా ఆ ఓటు చెల్లుతుంది.
- 1వ నంబర్ ప్రాధాన్యత ఓటు వేయకుండా 2, 3, 4 నంబర్లతో ఓట్లేస్తే ఆ ఓటు చెల్లదు.
- తప్పనిసరిగా 1 నుంచి సీరియల్‌గా మాత్రమే ఓటు వేయాలి.
- ఒక అభ్యర్థికి ఒక అంకెను మాత్రమే వేయాలి.
- అంకెలను తెలుగులో కానీ, ఇంగ్లిష్‌లో, ఇతర భాషాల్లో వన్, టు, త్రీ అని పదాలు, అక్షరాల్లో రాయకూడదు.
- బ్యాలెట్ పేపర్‌పై ఎలాంటి సంతకాలు చేయకూడదు.
- వేలిముద్ర వేయకూడదు.
- అభ్యర్థికి ఎదురుగా ఉన్న బాక్సులో రైట్ గుర్తు, ఇంటు గుర్తు పెట్టకూడదు.

సొంత పెన్నుతో ఓటు వేయొద్దు..

- బ్యాలెట్‌లో ఓటర్ ఓటు వేసేటప్పుడు సొంత పెన్నుతో ఓటు వేయొద్దు.
- అలా వేస్తే ఓటు చెల్లదు.
- ఒకరికి ఇచ్చిన ప్రాధాన్యత ఓటు మరో అభ్యర్థికి ఇచ్చినా ఆ ఓటు చెల్లదు.
- ఒకరికి 1వ నంబర్ వేసి దాన్ని పదేపదే దిద్దినా ఆ ఓటు చెల్లదు.
- బ్యాలెట్ పేపర్‌ను బాక్సులో వేయకుండా తీసుకెళ్తే కేసు నమోదు చేస్తారు.
- బాక్సు మధ్యలో మాత్రమే నంబర్ రాయాల్సి ఉంటుంది.
- రిటర్నింగ్ అధికారి ఇచ్చిన ఊదా రంగు స్కెచ్ పెన్నుతో గాక ఇతర ఏ పెన్నులతో రాసినా అది చెల్లుబాటు కాదు.
- ఏ అంకెలు వేయకుండా ఖాళీ బ్యాలెట్ పేపర్ ఇచ్చినా ఆ ఓటు చెల్లుబాటు కాదు.

'మేడిగడ్డ' బొరియతో బుగులు

- గేట్ల మరమ్మతులు ప్రారంభం
- ఇరురాష్ట్రాలకు రాకపోకలు బంద్



రాకపోకలు నిలిపివేస్తూ బ్యారేజీ గేట్ మూసివేసిన అధికారులు

రాకపోకలు బంద్

మేడిగడ్డ బ్యారేజీలో బొరియ ఏర్పడడంతో మహారాష్ట్ర, తెలంగాణ మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. గతేడాది బ్యారేజీ పియర్లు కుంగినప్పటికీ కనీసం టూవీలర్‌కు అనుమతిచ్చేది. శనివారం నుంచి గేట్లు వేసి ఎవరినీ అనుమతించడం లేదు. దీంతో రెండువైపులా వచ్చేవారు గంటతరబడి నిరీక్షించి వెళ్లిపోతున్నారు.

కాళేశ్వరం: గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ బ్యారేజీలో బొరియ పడడంతో నిర్మాణ సంస్థతో పాటు ఇరిగేషన్‌శాఖ అధికారులు బుగులు చెందుతున్నారు. బొరియ ఎక్కడి నుంచి.. ఎక్కడి వరకు ఉందనే విషయం అధికారులకు అంతుచిక్కడం లేదని తెలిసింది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. బ్యారేజీ నిర్వహణతో పాటు ఇరిగేషన్‌శాఖ ఇంజనీర్ల పనితీరుపై సీరియస్‌గా ఉన్నారు. త్వరలో సీఎంతో పాటు మంత్రులు రానుండడంతో మరమ్మతులు చేపట్టిన నేపథ్యంలో బ్యారేజీలోని 7వ బ్లాకులో 20 పియర్ ముందు పెద్ద బొరియ(గొయ్యి) ఏర్పడడంతో నిర్మాణసంస్థ, ఇరిగేషన్‌శాఖలు హుటాహుటినా ఆ ప్రాంతంలో మట్టి నింపారు.

మరో రెండు బ్లాకుల్లో కూడా బొరియలు?

7వ బ్లాకు పక్కన గల 8, 6వ బ్లాకుల్లో కూడా బొరియలు విస్తరించి ఉండొచ్చనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఫౌండేషన్ ఎలా ఉంది? బ్యారేజీ పొడవునా ఇలాగే ఉందా? అనే విషయంపై జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షల నిర్వహించడం ద్వారా పూర్తిగా తెలువనుంది. గ్రౌటింగ్ చేసి సుమారు 40వేల ఇసుక బస్తాలు వేశారు. ఇప్పటికే ఎన్‌డీఎస్‌ఏ ఏర్పాటు చేసిన చంద్రశేఖర్ అయ్యర్ కమిటీ, మాజీ సుప్రీంకోర్టు జడ్జి పినాకి చంద్రఘోష్ టీమ్‌ల సూచనలతో వర్షాకాలంలోపు తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన విషయం తెలిసిందే. మూడు రోజుల క్రితం సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రిసెర్చ్ స్టేషన్(సీడబ్ల్యూపీఆర్ఎస్) టీమ్ బృందం పరిశీలన చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను సందర్శించి తమ నివేదికలు అందజేయనుంది. మేడిగడ్డ బ్యారేజీ వద్ద సీసీ బ్లాకుల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. 7వ బ్లాకులో మొరాయించిన గేట్ల నట్లు విప్పుతున్నారు. పూర్తిగా గేట్లను తొలగించిన తరువాత మరమ్మతులు చేయడానికి వీలవుతుందని తెలిసింది.

రైతు ప్రాణం తీసిన మొక్కజొన్న చొప్ప..



భగవాన్‌రెడ్డి(ఫైల్)

సంగెం: మొక్కజొన్న చొప్ప మంటలు ఆర్పుతున్న క్రమంలో ఊపిరాడక ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన సంగెం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కాట్రపల్లికి చెందిన గాయపు భగవాన్‌రెడ్డి(56)కి భార్య రమాదేవి, ముగ్గురు కూతుళ్లు దివ్య, శ్రుతి, మౌనిక, తల్లి సమ్మక్క ఉన్నారు. తనకున్న భూమిలో వ్యవసాయం చేస్తు కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం సాయంత్రం మొక్కజొన్న చొప్పకు నిప్పు పెట్టాడు. గాలి దుమారానికి పక్కన ఉన్న భాస్కర్‌రెడ్డికి చెందిన ఫామాయిల్ తోటలోని మొక్కజొన్న చొప్ప, డ్రిప్ పైపులకు మంటలు అంటుకున్నాయి. మంటలు ఆర్పేందుకు భగవాన్‌రెడ్డి తీవ్ర ప్రయత్నం చేశాడు. మోకాళ్ల నొప్పులు ఉండడంతో మంటలు, పొగనుంచి తప్పించుకోలేక ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం పక్క రైతు.. కుటుంబీకులు పోలీసులకు తెలిపారు. ఘటనా స్థలికి చేరుకున్న ఎస్సై నరేష్.. భగవాన్‌రెడ్డి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

● టీచర్ ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి



యాదగిరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రఘోత్తమ్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి

విద్యారణ్యపురి: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ, వరంగల్ జిల్లా పీఆర్‌టీయూ శాఖల ఆధ్వర్యంలో హనుమకొండలోని పీఆర్‌టీయూ భవనం వద్ద యూనియన్ టీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత సామల యాదగిరి వర్ధంతి కార్యక్రమంలో రఘోత్తమరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగియగానే నిలిచిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పూర్తిచేయిస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల ప్రయోజనాలు నెరవేర్చేందుకు ఏ ప్రభుత్వమున్నా ఆ ప్రభుత్వంతో మమేకమై పనిచేసే అతిపెద్ద సంఘం పీఆర్‌టీయూ అని, దీనిని కాపాడుకోవాల్సి బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్, హనుమకొండజిల్లా అధ్యక్షుడు మంద తిరుపతిరెడ్డి, జనరల్ సెక్రటరీ ఫలితశ్రీహరి, వరంగల్ జిల్లాల అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శులు తిరునగరి శ్రీనివాస్, ఎడ్ల ఉపేందర్‌రెడ్డి, సామల పట్టాభి, కరీంనగర్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి జాలిరాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నానమ్మ కోసం కట్టిన చీర మనవడికి ఉరితాడు

- ఆడుకుంటూ అనంతలోకాలకు..
- చీర చుట్టుకుని బాలుడి మృతి
- గానుగుపహాడ్‌లో ఘటన



బాలుడి మృతికి కారణమైన ఊయల



అన్న మృతదేహం వద్ద రోదిస్తున్న తమ్ముడు



సంపత్ (ఫైల్)

జనగామ రూరల్: బాత్‌రూంలో నానమ్మ కోసం సపోర్టుగా ఏర్పాటు చేసిన చీర.. మనవడికి ఉరితాడైంది. చీర చుట్టుకుని ఊపిరాడక అప్పటి వరకు తల్లి కళ్లెదుటే ఎగిరి గంతులు వేసిన ఆ బాలుడు క్షణాల్లో కనిపించని లోకాలకు వెళ్లాడు. ఈ విషాదకర ఘటన శనివారం జనగామ మండలం గానుగుపహాడ్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆంజనేయులు, అనిత దంపతులు బతుకుదెరువు నిమిత్తం ఏడు నెలల క్రితం హైదరాబాద్ వెళ్లారు. నాచారంలో వాచ్‌మెన్‌గా పని చేస్తూ.. తన ఇద్దరు పిల్లలు సంపత్(11), గణేష్‌ను గ్రామంలోని తల్లిదండ్రుల వద్ద ఉంచారు. ఇద్దరు పిల్లలు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుంటున్నారు. గ్రామంలో ఇటీవల జరిగిన దుర్గామాత ఉత్సవాల కోసం ఆంజనేయులు దంపతులు పదిహేను రోజుల క్రితం వచ్చారు. పండగ ముగిసి.. ఎవరి పనుల్లో వారు బిజీగా ఉన్నారు. ఈ సమయంలో పెద్ద కుమారుడు సంపత్ బాత్‌రూంలో ఉన్న చీర మెడకు చుట్టుకుని మృతి చెందాడు. 95 ఏళ్ల వయసున్న తల్లికి సపోర్టు కోసం ఆంజనేయులు బాత్‌రూంలో చీరకట్టి ఉంచారు. సంపత్ అందులోకి వెళ్లి... ఊయలలా ఉన్న చీరతో ఆడుకునే సమయంలో మెడకు చిక్కుకుని ఊపిరి ఆడక మృతి చెందాడు. తల్లి అనిత బట్టలు ఉతికే క్రమంలో బాత్‌రూంకు వెళ్లగా.. సంపత్ వేలాడుతూ కనిపించడంతో కేకలు వేసింది. అప్పటి వరకు తల్లి కళ్ల ముందటే ఎగిరి గంతులు వేసిన సంపత్.. క్షణాల్లో కనిపించని లోకాలకు వెళ్లడంతో ఆ కుటుంబం గుండెలవిసేలా రోదించింది. విగత జీవిగా పడి ఉన్న బాలుడిని చూస్తూ... తమ్ముడు గణేష్.. అన్నా అన్నా అంటూ ఏడుస్తుంటే అక్కడున్న అందరి హృదయాలను కలిచి వేసింది. ఈ ఘటనపై చిన్నారి తండ్రి బండి రాజుల ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సృజన్ తెలిపారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.